www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 31 జనవరి 2024

5

చిత్తూరు



జిల్లా ఎస్పీగా జాషువా



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా ఎస్పీగా జాషువాను నియమిస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణాజిల్లా ఎస్పీగా పనిచేస్తున్న జాషువాను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. చిత్తూరు జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న రిషాంత్ రెడ్డిని కౌంటర్ ఇంటిలిజెన్సీ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జాషువా 2022 జూన్ నుంచి కృష్ణాజిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఈయన 2013లో పలమనేరు డిఎస్పీగా పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాషువాను చిత్తూరుకు బదిలీ చేశారు. జాషువా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు. మరోవైపు రిశాంత్ రెడ్డికి తిరుపతిలోని ఎర్రచందనం స్మగ్లర్ నిరోధక విభాగానికి ఇన్చార్జిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దీక్ష భగ్నం చేసినా..

తగ్గేదేలే..!

అటవీ కార్మికుల సమస్య పరిష్కరించాలి
రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్షం
మరో ఏడుగురితో నిరవధిక దీక్ష కొనసాగింపు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అటవీ కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షలను సోమవారం అర్ధరాత్రి పోలీసులు భగ్నం చేయడంతో, ఏమాత్రం వెనకడుగు వేయకుండా అటవీ కార్మికులు దీక్షను కొనసాగించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సహా, మరో ఎనిమిది మంది అటవీ కార్మికులను పోలీసులు బలవంతంగా వారి ఆరోగ్యం క్షీణించిందన్న సాకుతో అరెస్టు చేసి, రుయాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో అప్పటికప్పుడే మరో ఏడుమంది అటవీ కార్మికులు దీక్షా శిబిరం ఖాళీ అవకుండానే పూలమాలలు ధరించి దీక్షను కొనసాగించారు. ఎంతమందిని అరెస్టు చేసినా సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ దీక్ష ఆపేది లేదని వెల్లడించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరంటూ నినదించారు. మంగళవారం వీరి దీక్షలకు అఖిలపక్షం సంఘీభావం ప్రకటించింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ టిటిడి యాజమాన్యం చర్చలకు పిలిచి అర్ధరాత్రి దీక్షల్లో ఉన్నవారిని అరెస్టు చేయిస్తారా? అని ప్రశ్నించారు. ఫారెస్టు కార్మికులకు టైంస్కేల్ వర్తింపజేస్తామని టిటిడి బోర్డు చేసిన తీర్మానం అమలు చేయకుండా, హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా, టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఫారెస్టు కార్మికులు చేస్తున్న దీక్షకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆర్‌పిఐ అధ్యక్షులు పి.అంజయ్య, ఎపి ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ ఫారెస్టు కార్మికులను విడగొట్టి కొంతమందిని పర్మినెంట్ చేసి, మరికొంతమందిని కార్పొరేషన్‌లో కలపడం వివక్ష కాదా? అని ప్రశ్నించారు. సమస్య పరిష్కరించకుండా పోలీసులతో దీక్షను భగ్నం చేయడాన్ని తప్పుబట్టారు. చిత్తూరు జిల్లా సిఐటియు జిల్లా నాయకులు చైతన్య, సురేంద్ర, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, టిఎన్‌టియుసి నాయకులు రెడ్డెప్పనాయుడు మాట్లాడుతూ ఫారెస్టు కార్మికుల జీవితాలతో టిటిడి చెలగాటమాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కారయదర్శి టి.సుబ్రమణ్యం, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్,రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ నేత శ్రీను, నాయకులు మునిరాజా, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు ఇఎస్ కుమార్, సిఐటియు నాయకులు ఆర్.లక్ష్మి, పి.బుజ్జి, చిన్నా, వాసు, తంజావూరు మురళి, తిరుపతి అన్నారావు సర్కిల్ స్టాండ్ నాయకులు కుమార్, శంకరయ్య పాల్గొన్నారు.

సర్.. పంచ్‌లు..

- ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు
- నిధుల దారి మళ్లింపు
- బ్లీచింగ్, ఫినాయిల్ చల్లలేని దుస్థితి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

సర్... పంచులు జగనన్న సర్కార్‌లో నిధులులేని గ్రామ పంచాయతీలు నిరశించిపోతున్నాయి. నిధుల దారిమళ్లింపుతో గ్రామ పంచాయతీల్లో రాజారాజుగా ఉన్న సర్పంచులు ప్రస్తుతం ఉత్సవ విగ్రహాలు మారిపోయారు. గ్రామ పంచాయతీలు సచివాలయాలుగా మారిపోయాయి. సర్పంచుల స్థానంలో గ్రామసచివాలయ కార్యదర్శులు పెత్తనం సాగిస్తున్నారు. గెలిచి మూడు సంవత్సరాలు గడుస్తున్నా.... గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి వీధుల్లో బ్లీచింగ్ చల్లేందుకు కూడా నిధులు లేవంటున్నారు. కొందరైతే తాము పంచాయతీ సర్పంచులమనే విషయాన్ని మర్చిపోయారనే చెప్పాలి.

ప్రతిపక్ష పార్టీల సర్పంచులే కాదు... అధికార పార్టీ సర్పంచులు కూడా గ్రామ పంచాయతీలకు జరుగుతున్న అన్యాయంపై దుమ్మెత్తిపోస్తున్నారు. గుడిపల్లి మండలం శెట్టిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎస్సీ రిజర్వుడ్ కావడంతో ఉన్నత చదువులు చదవుకున్న యల్లప్ప పోటీ చేసి విజయం సాధించారు. మూడేళ్ళ క్రితం జరిగిన సర్పంచ్ ఎన్నిక శెట్టిపల్లి పంచాయతీ జనరల్ అయినా యల్లప్ప చేసిన అభివృద్ధి పనుల వలన మళ్లీ పోటీ చేసి విజయం సాధించాడు. జగన్ ప్రభుత్వంలో మూడేళ్ళ పాటు ఒక్క రూపాయి పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు కాకపోవడంతో సర్పంచ్ యల్లప్ప అతడి భార్య ఇద్దరు కలసి గ్రామంలో బిక్షం ఎత్తి రూ.6 వేలు సేకరించి పైపులైన్ మరమ్మతులు చేయించారు. ఇదేనా మహాత్ముడు కళలు కన్న గ్రామ స్వరాజ్యం అంటూ ప్రశ్నస్తున్నారు.

పంచాయతీల నిధులు దారి మళ్లింపు..

రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలలోని రూ.3.50కోట్లు గ్రామీణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మంజురు చేసిన 14వ ఆర్థిక సంఘం నిధులు 2018-19 సంవత్సరం రూ.1,229.23 కోట్లు, 2019-20 సంవత్సరం రూ.2,336.56 కోట్లు అలాగే 15వ ఆర్థిక సంఘం 2020- 21 సంవత్సరం రూ.2,625 కోట్లు, 2021-22 సంవత్సరంలో రూ.1,939 కోట్లు మొత్తం కలిపితే రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు అందాల్సిన నిధులు రూ.8.629.79 కోట్లు పంచాయతీ నిధులు జగన్ సర్కార్ దారి మళ్లించింది. గ్రామ సర్పంచులకు తెలియకుండానే సిఎఫ్ఎంఎస్ అకౌంట్ల నుండీ డబ్బులు ఖాళీ చేసింది. అలాగే 2022-23 రూ.2,010 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.2,031 కోట్లు కేంద్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి విడుదల చేసే నిధులు దాదాపు రూ.4,041 కోట్లు గ్రామ పంచాయతీలకు చేరలేదు. తిరిగే వైసిపి అధికారంలోకి వస్తే మరో రెండుళ్ళు మా పరిస్థితి ఏమిటని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కుర్చీ సర్పంచ్‌ది.. పెత్తనం కార్యదర్శిది...

గ్రామ పంచాయితీల్లో సర్పంచ్‌కే సర్వాధికారాలు.... ఆయన మాటే శాసనంలా ఉండేది. వైసిపి పాలనలో కుర్చీ సర్పంచ్‌లది.... పెత్తనం పంచాయతీ కార్యదర్శులదిగా మారిపోయింది. గ్రామ సచివాలయాలు, వాలంటీర్లు 73,74 రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం గ్రామ సర్పంచ్ పరిధిలో పనిచేయాలి. గతంలో నరేగా నిధులు, క్వారీ, మైనింగ్, ఇసుక, పన్నుల ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చేది ప్రస్తుతం ఇవి కూడా రావడం లేదు. పైగా గ్రామ పంచాయతీ విద్యుత్ బిల్లులు చెల్లించాలనే ప్రభుత్వ ఆదేశాలతో అంతత మాత్రం వచ్చే ఆదాయం కాస్తా విద్యుత్ బిల్లులకు కూడా సరిపోక అప్పులు చేయాల్సి వస్తోంది. చివరకు అధికార కార్యక్రమాలకు సర్పంచుల పేర్లను కూడా ఆహ్వాన పత్రికల్లో, శిలాఫలకాల్లో వేసే పరిస్థితి లేదు. పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని, నిధుల దారి మళ్లింపుపై సుదీర్ఘంగా ప్రభుత్వంతో పోరాటం చేస్తున్న సర్పంచులు రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 30వ తేదీ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మహాత్మ నీవు కళలు కన్న గ్రామ స్వరాజ్యం అంటే ఇదేనా అంటూ కలెక్టరేట్ల ఎదుట ఆందోళనకు పూనుకున్నారు. జగన్ సర్కార్ మరోసారి విజయం సాధిస్తే గ్రామ స్వరాజ్యం దేవుడెరుగు....... సర్పంచులుగా పోటీ చేసేందుకు ఎవ్వరూ ముందుకు రారంటున్నారు ప్రస్తుత సర్పంచ్‌లు.

ప్రభుత్వమిచ్చిన హామీలు అమలు చేయాలి

రెండో రోజూ సర్ఫ్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ)లో పనిచేస్తున్న ఏపీఎంలు, సీసీలు, డీఎంపీలు, ఏరియా కోఆర్డినేటర్లు సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంతి పథకం ఉద్యోగుల సంఘం నాయకులు (సర్ఫ్) హరినాథ్, ప్రభాకర్, సుధాకర్, రజనీలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సర్ఫ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, టైమ్స్ స్కేల్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడే ఐదేళ్లు గడుస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళనకు పూనుకోవాల్సి వచ్చిందని, తమ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు.

మండల పరిధిలో రూ.3.51 కోట్లు పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డ్వాక్రా మహిళల అప్పులను ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తీరుస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రి కె.నారాయణస్వామి పేర్కొన్నారు. మంగళవారం పాలసముద్రం ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 4వ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి హాజరై లబ్ధిదారులకు మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలోని మహిళాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్న ముఖ్యమంత్రి డ్వాక్రా మహిళలు రుణాల కింద బ్యాంకులకు చెల్లించిన అప్పులను తిరిగి వారి ఖాతాలకు నాలుగు విడతలుగా చెల్లించడం జరిగిందని అన్నారు. పాలసముద్రం మండలంలోని 432 ఎస్‌హెచ్‌జి గ్రూప్‌లకు చెందిన 3,926 మంది స్వయం సహాయక సంఘసభ్యుల రుణం మొత్తం రూ.14.03కోట్లు కాగా గతంలో వైఎస్ఆర్ ఆసరా ద్వారా మూడు విడతలలో రూ.10.53కోట్లు చెల్లించగా 4వ విడత కింద మిగిలిన రూ.3.51 కోట్లు పంపిణీ చేయడం ద్వారా డ్వాక్రా మహిళల రుణాలను పూర్తిగా తిరిగి చెల్లించినట్లు అవుతుందన్నారు. డ్వాక్రా రుణాలకు చెల్లించిన వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలకు తిరిగి చెల్లిస్తున్నదన్నారు. మండలం తహశీల్దారు బాబు, ఎంపీడీఓ రామనాథ్, ఎపిఎం ఫరిధ్ మస్తాన్, జడ్పీటీసీ అన్బు, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పుంగనూరులో దారుణం

మహిళను నిర్బంధించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి



ప్రజాశక్తి- పుంగనూరు: రోజురోజుకు పుంగనూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులచేత మోసపోతున్న కొనుగోలుదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనిపైన పోలీసుశాఖ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. అందుకు ఉదాహరణ మహిళలు నిర్బంధించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో ఓ మహిళ ఆదినారాయణ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంటి సైటుకు రేటు కుదుర్చుకొని అడ్వాన్స్ రూపంలో రూ.10లక్షల తీసుకున్నారు. దీనిపై సైటును మిగిలిన బ్యాలెన్స్ డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని పలుసార్లు అభ్యర్థించిన వారిలో స్పందన లేకపోయింది. ఇచ్చిన డబ్బులు అడిగినందుకు ఆదినారాయణ ఇంటికి వెళ్లిన ఆ మహిళపై దాడి చేసి ఇంటిలో నిర్బంధించారు. దీంతో ఆ మహిళ భయపడి 100కు కాల్ చేసి పోలీసుల చొరవతో బయట పడింది. ఈ సంఘటనపై పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెంచీల రగడ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిజేఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచ్‌లను తొలగిస్తున్న క్రమంలో జరుగుతున్న పోలీస్, మున్సిపల్ శాఖ దౌర్జన్యాన్ని ప్రశ్నిస్తున్న టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, టిడిపి నాయకులు, బీసీ సెల్ నాయకులు వెంకటేష్ యాదవ్, నాయకులు హేమాద్రి నాయుడు, జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, ధరణి, ప్రకాష్‌లు అడ్డుకున్నారు. ఈ సంఘటనతో కట్టమంచి చెరువు వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జీజేఎం ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ అనుమతి లేకుండానే ఏర్పాటు చేయడంపై ఆగ్రహించిన మున్సిపల్ సిబ్బంది మంగళవారం ఉదయం నుండి చిత్తూరు నగరంలో జీజేఎం ట్రస్ట్ ఏర్పాటు చేసిన బెంచీల తొలగింపుకు పూనుకున్నారు. కట్టమంచి చెరువు వద్ద ఏర్పాటు చేసిన బెంచీలు తొలగిస్తున్నారని విషయం తెలియగానే జీజేఎం ట్రస్ట్ సిబ్బంది తెలుగుదేశం నాయకులు అక్కడికి చేరుకొని మున్సిపల్ అధికారులతో వాగ్వావాదానికి దిగారు. గంటపాటు పోలీసులకు తెలుగుదేశం నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. కట్టమంచి చెరువు నగరపాలక సంస్థ.... లేక ఇరిగేషన్ అనే విషయంపై పోలీసులు తెలుగుదేశం నేతల మధ్య చర్చ నడిచింది. అంతలో డిఎస్పి శ్రీనివాస మూర్తి ఆందోళనకారులకు నచ్చజెప్పి బెంచీల ఏర్పాటు అనుమతి తీసుకున్న తర్వాత చేయాలంటూ ఏర్పాటు చేసిన బెంచీలను తొలగించారు.



సిఐ విశ్వనాథంతో ఘర్షణ పడుతున్న తెలుగుదేశం నేతలు

ట్రాఫిక్ జామ్‌తో తమిళ సినిమా షూటింగ్ నిలిపివేత



ప్రజాశక్తి - తిరుపతి సిటి

తమిళ సినిమా షూటింగ్ నిమిత్తం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో తిరుమలకు వెళ్లే అలిపిరి వద్ద ట్రాఫిక్ జామ్ అయిన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. తమిళ్ హీరో ధనుష్ తాజా చిత్ర షూటింగ్‌ను మంగళవారం ఉదయం అలిపిరి సమీపంలోని శ్రీ బాలాజీ లింకు బస్టాండ్ వద్ద అనుమతించడంతో అటువైపు వెళ్లే వాహనాలను పోలీసులు దారి మళ్ళించారు. దీంతో తిరుమలకు వెళ్లే భక్తులు ఇబ్బంది పడ్డారు. తిరుమలకు వెళ్లే వాహనాలను ఇస్కాన్ మార్గం, టీటీడీ గోడౌన్, రుయా ఆస్పత్రి, బధిర హాస్టల్ మీదుగా దారి మళ్ళించారు. చిత్తూరు- బెంగళూరు -మదనపల్లి ప్రాంతాలకు వెళ్లే వాహనాలకూ ఇదే ప్రధాన రహదారి కావడంతో సుమారు అర్ధకిలోమీటర్ దూరం వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి షూటింగ్ ప్రారంభం కావడంతో 8, 9 గంటల మధ్య స్విమ్స్, రుయా, మెటర్నిటీ, బర్డ్, కార్పొరేషన్ కార్యాలయం, ఎస్విఐ ఆయుర్వేదిక్ హాస్పిటల్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల, శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హదయాలయ ఆసుపత్రి, భారతీయ విద్యాభవన్, ఎస్వీ మెడికల్ కళాశాల, ఎస్వీ యూనివర్సిటీ, వేదిక యూనివర్సిటీ, సంస్కత యూనివర్సిటీ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు, వారి సహాయకులు ట్రాఫిక్ జాంలో ఇరుక్కుని తీవ్ర అవస్థలు పడ్డారు. పోలీసులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా, ఉన్నపలంగా ట్రాఫిక్ మళ్ళించడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శలు రావడంతో సినిమా షూటింగ్‌ను చిత్ర యూనిట్ నిలిపివేసింది. రెండు రోజుల పాటు గరుడ విగ్రహం, నంది సర్కిల్, గోవిందరాజస్వామి ఆలయాల వద్ద అనుమతి తీసుకున్నా, చిత్రం యూనిట్ సభ్యులకు, ప్రజలకు మధ్య రద్దీ విషయమై గొడవ జరగడంతో పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టుకునే వరకూ వెళ్లింది. దీంతో తాత్కాలికంగా షూటింగ్‌ను నిలిపేశారు.



- 'ఉపాధి' కొలతలూ మాయం
- అంతా అధికార పార్టీ అండతోనే
- గ్రామస్తులు అడ్డుకున్నా బేఖాతర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్న మెగా సంస్థ మట్టి దందా ఇప్పుడల్లా ఆగేలా కనిపించడం లేదు.. రహదారి విస్తరణ పనులు పూర్తయ్యేలోపు చెరువులు, ప్రభుత్వ భూములు, రహదారులను, ఊర్లను చిద్రం చేసే వరకూ ఊరుకునేలా లేదు ..మా చెరువుల్లోంచి మట్టి తోలొద్దనీ, గ్రామీణ రహదారుల్లో రాకపోకలు సాగించొద్దని రైతులు, గ్రామస్తులు మొత్తుకుంటున్నా యాజమాన్యం ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. స్థానికంగా ఉండే అధికార పార్టీ నాయకుల అండ చూసుకుని తవ్వకాలు చేసేస్తున్నారు. మెగా సంస్థ మట్టి దందా పరాకాష్ట ఏ స్థాయికి చేరిందంటే చెరువుల్లో ఉపాధి కూలీలు చేసిన పనుల్లో కొలతలను సైతం మాయం చేస్తోంది. అధికారపార్టీ అండదండలతో పాటు, ప్రభుత్వ యంత్రాంగం ఆశీస్సులు మెండుగా ఉండటంతో మెగా సంస్థ మట్టి దోపిడీ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తారా స్థాయికి చేరిందన్న విమర్శలు ఉన్నాయి.

చెరువుల్లో 'మెగా' లీలలు

మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి పనులను మెగా సంస్థ రూ.5 వేల కోట్ల వ్యయంతో చేపట్టింది. ఈ ప్రాజెక్టు పనులు 2023లోనే పూర్తి కావాల్సి ఉండగా పరిహారం, కోర్టు వివాదాల నేపథ్యంలో సాగుతూ వస్తోంది. అయితే 2022 నుంచి రహదారి విస్తరణ పనుల్లో వేగం పుంజుకోగా, మొదటి విడతలో భాగంగా నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు ఆరు లేన్ల రోడ్డును వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డును బలోపేతం చేసేందుకు అవసరమైన మట్టిని, ఎర్రగుల్లను మెగా యాజమాన్యం ప్రభుత్వ భూములు, రైతుల ప్రైవేటు పొలాలు, చెరువుల నుంచి తరలించేందుకు పూనుకుంది. ఈ క్రమంలో అధికారుల నుంచి, గ్రామస్తులు, రైతుల నుంచి కనీస అనుమతులు తీసుకోవాలన్నా నిబంధనను మరిచింది. అధికారపార్టీ అండ చూసుకుని తవ్విన కాడికి తవ్వుకుంటున్నారన్న ఆరోపణలు పెచ్చుమీరుతున్నాయి. మెగా సంస్థ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టిన నాటినుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వందల చెరువుల్లో పరిమితికి మించి తవ్వకాలు చేశారన్న విమర్శలు ఉన్నాయి. చెరువుల్లో కేవలం ఒక మీటరు లోతులో మాత్రమే మట్టిని తవ్వాలన్న నిబంధన ఉంది. అంతేకాకుండా తూములు, కలుజులు, చెరువు కట్టలకు దగ్గరగా తవ్వకాలు చేయకూడదన్న నిబంధనా ఉంది. అయితే మెగా యాజమాన్యం ఆ నిబంధనలను తుంగలో తొక్కేసి ఇష్టమొచ్చిన చోట, ఇష్టమొచ్చిన లోతులో తవ్వకాలు చేసేస్తోంది. ఫలితంగా భవిష్యత్తులో కట్ట, తూములు దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా చెరువుల్లో పరిమితికి మించి మట్టిని తరలించడం వల్ల భూగర్భ జలాలు సైతం అడుగంటి పోయే ప్రమాదం ఉంది. తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి, రౌతుసూరమాల, గుండేలిగుంట, కాసరం, శ్రీకాళహస్తి మండలంలోని ఉడమలపాడు, పెళ్లకూరు చెరువుల్లో పెద్ద ఎత్తున మట్టి, ఎర్ర గుళ్ల తవ్వకాలు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో చెరువుల్లో వ్యవసాయ కూలీలు చేసిన ఉపాధి హామీ పనుల కొలతలను నాశనం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా కాసరం చెరువులో పరిమితికి మించి తవ్వకాలు చేయడం వల్ల రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన ఉపాధి హామీ పనుల కొలతలను నాశనం చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఈ చెరువులో చేసిన ఉపాధి పనుల కొలతలపై ఇంకా ఆడిటింగ్ జరగలేదనీ, సామాజిక తనిఖీ బృందం తనిఖీలకు వస్తే తామేం చూపించాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే చెరువుల్లో మట్టి తవ్వకాలు చేసేటప్పుడు తప్పకుండా ఇరిగేషన్ అధికారుల అనుమతికి తోడు, గ్రామ పెద్దల సహకారాన్ని కూడా కోరాల్సి ఉంటుంది. ఆ చెరువులో మట్టి తవ్వకాలు చేసినందుకు గాను క్యూ.మీటరకు ఇంతని గ్రామానికి పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మెగా యాజమాన్యం ఇవేమీ చేయకుండా అక్కడున్న స్థానిక వైసీపీ నేతలతో చేతులు కలిపి గ్రామాలకు దక్కాల్సిన పరిహారానికి కూడా ఎగనామం పెట్టారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మెగా యాజమాన్యం చెర నుంచి చెరువులను, కుంటలను కాపాడాల్సి ఉంది.

'బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం'

ప్రజాశక్తి-కార్వేటినగరం: బాధిత కుటుంబాలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిస్తోందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మంగళవారం కార్వేటినగరం పరిధిలోని చింతతోపు ఎస్టీకాలనీకి చెందిన టీ.లోకేష్ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎంపీపీ గ్రామానికి వెళ్లి వైఎస్సార్ బీమా పథకం కింది రూ. లక్ష ప్రభుత్వం అందిస్తుందని, తక్షణ సహాయం కింది మృతుని భార్య మణెమ్మకు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపి, ఎంపీటీసీ ధన్రాజ్, పంచాయతీ కార్యదర్శి పీఎన్ మణి, దొరబాబు, సిబ్బంది జనార్ధన్, వలంటీరు రవి ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పొదలకుంటపల్లిలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 372మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. ఎస్ నడింపల్లి సర్పంచ్ వెంకటరమణ, వైద్యాధికారులు జయసింహ, సోమేశ్వర రెడ్డి, భార్గవి, నరసింహులు, అమర్నాథ్, పంచాయతీ కార్యదర్శి జయశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

'వన్మతి'కి పరామర్శ

ప్రజాశక్తి-నగరి: ప్రభుత్వ ఆస్పత్రిలోని ఒక వైద్యురాలి వద్ద ఆపరేషన్ ద్వారా ప్రసవించిన గుండ్రాజుకుప్పం దళితవాడకు చెందిన వన్మతి అనే మహిళ పలు ఆరోగ్య సమస్యలు ఎదురుకావడంతో ఆస్పత్రి వద్ద గ్రామస్థులతో వచ్చి నిరసన వ్యక్తం చేయడం, మంత్రి ఆర్కేరోజా ఆదేశాల మేరకు వైద్యురాలిపై ఎంక్వయిరీ వేయడం విధితమే. కాగా మంగళవారం మంత్రి భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి వన్మతి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని ఆమె భర్తను అడిగితెలుసుకున్నారు. బాధపడాల్సిన అవసరం లేదని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆర్సి పురం ఎస్ఐ బదిలీ

ప్రజాశక్తి-రామచంద్రపురం: రామచంద్రాపురం ఎస్ఐగా పని చేస్తున్న ఎస్సై గిరిబాబు అనంతపురంకు బదిలీ అయ్యారు. ఇన్ఛార్జ్ ఎస్ఐగా తిరుచానూరు ఎస్ఐ చిరంజీవిని నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ గిరిబాబు సొంత జిల్లాలో పనిచేస్తున్నందున ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఇటీవల ఎస్ఐల బదిలీ ఉత్తరములు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకే ఎస్ఐ గిరిబాబు ఆర్సి పురం నుండి సోమవారం రిలీవయ్యారు. అనంతపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. స్టేషన్లోని పోలీస్ సిబ్బంది, మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఆయన సేవలకు అభినందనలు తెలియజేశారు.

నేడు యర్రావారిపాళ్యంలో జయహో బీసీ సభ

ప్రజాశక్తి-యర్రావారిపాళ్యం: మండలం కేంద్రంలో బుధవారం జయహో బీసీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు టీడీపీ బీసీ సాధికార సమితి, పాలఏకరి చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లూరు దేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలు నుండి బీసీ ఎస్సీ ఎస్టీల కులాల వారికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా వారి అభివృద్ధిని కుంటుపడేలా చేసింది అన్నారు. నాలుగున్నర సంవత్సరం కాలం నుండి రౌడీయిజం, ఇసుక మాఫియా, బూదందా, ఎర్రచందనం లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఉన్నారని ఆమె విమర్శించారు. గతంలో టిడిపి ప్రభుత్వం బీసీలకు ఎంతో మేలు చేసిందని సబ్సిడీ రుణాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు బీసీలకు ప్రవేశపెట్టారని టిడిపి జిల్లా కార్యదర్శి అన్నాసముద్రం మధు అన్నారు. అలాగే రానున్న 2024 ఎన్నికలలో చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నానిని ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

బాధ్యతగా బస్సులు నడపండి..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్కూల్, కాలేజీ బస్సులు నడిపే డ్రైవర్లు బాధ్యతతో మసులుకోవాలని శ్రీకాళహస్తి మోటార్ వాహనాల తనిఖీ అధికారి దామోదర్ నాయుడు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంవీఐ కార్యాలయంలో మంగళవారం ప్రైవేట్ స్కూల్, కాలేజీల బస్సు డ్రైవర్లతో దామోదర్ నాయుడు సమావేశమయ్యారు. స్కూలు బస్సులు నడిపే డ్రైవర్లు అందరూ చాలా అప్రమత్తతో విద్యార్థులను క్షేమంగా వారి గమ్య స్థానాలకు చేర్చాలని తెలిపారు. వాహనాన్ని మితిమీరిన వేగంతో, మద్యం, మత్తుపదార్థాలు సేవించి నడుపరాదని సూచించారు. అదేవిధంగా సెల్ఫోన్ వాడుతూ బస్సు నడపడం నేరమని హెచ్చరించారు. ప్రతి బస్సుకు డ్రైవర్తో పాటు ఒక అటెండర్ కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రాస్ ఆర్థిక లావాదేవీల ఆడిట్ పై అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాస్ మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీల ఆడిట్పై స్థానిక రాస్ మహిళా వాణి కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. రాస్ అంతర్గత ఆడిట్ విభాగ మేనేజర్ బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో '8' క్లస్టర్ల నుండి '565' సంఘాలు, '6717' మంది సభ్యులకు సంబంధించి బ్యాంకు ద్వారా జరిగిన అన్ని నగదు లావాదేవీల ఆడిట్ చేయించారు. రాస్ ప్రాజెక్టు జి.వెంకటేష్, సుబ్బారావు, వినోద్, స్వరూప, జ్యోష్ణ, నాగలక్ష్మి, పల్లవి, హేమంత్కుమార్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి: ఎంపీపీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. అలాగే సీసీ రోడ్లు నిర్మాణం కూడా 98శాతం పూర్తి అయినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. అలాగే మూడు నెలలకు ఒక్క సారి జరిగే మండల సర్వసభ్యసమావేశానికి కూడా అధికారులు గైరహాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామవేశానికి హాజరు కానీ అధికారులకు నోటీసీ జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో మోహన్మురళి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పంచాయతీల వారీగా గ్రామాల అభివృద్ధికి మంజూరు చేసిన రూ.20 లక్షలను కొంత మంది సర్పంచ్లు గ్రామాల అభివృద్ధిపై చొరవ చూపకుండా నిధులు వారి ఖాతాల్లో మురుగుతున్నాయని, ఇప్పటికైనా స్పందించి అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పనులను వేగవంతం చేసి ఖాతాలో ఉన్న నిధులను ఖర్చు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేని పక్షంలో నిధులు వెనెక్కి వెళ్లే అవకాశం ఉందన్నారు. గాజంకిలో అంగన్వాడీ కేంద్రం శిధిలావస్థలో ఉందని సమావేశం దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన ఎంఈవో విజయకుమార్ నాడు-నేడు పథకం ద్వారా త్వరలో ఆధునీకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కొల్లాగుంట రైతు భరోసా కేంద్రంలో కూడా ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, వైస్ ఎంపీపీ మణెమ్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, ఎంఈవో 2 మనోజ్కుమార్, సీడీపీవో పద్మసునంద, డాక్టర్ గోపినాధ్. పలువురు

అంగన్వాడీ కేంద్రాలలో
మౌలిక వసతులు కల్పించండి

- మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సర్పంచులు

ప్రజాశక్తి-గంగవరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో సర్పంచ్లు ముక్కుమడిగా అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతులపై అధికారులను నిలదీశారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నపిల్లలకు మరుగుదొడ్లు కానీ ఇతర మౌలిక సదుపాయాలు కానీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, చిన్న పిల్లలు బహిరంగ ప్రదేశంలో వెళ్లి మూత్ర విసర్జన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే పై అధికారులకు నివేదిక అందజేస్తామని తెలియజేశారు. అన్ని శాఖల అధికారులు సంబంధించిన స్థితిగతులను శాఖల వారిగా వివరించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలం
టీడీపీ కోవర్ట్: మాజీ ఎమ్మెల్యే


ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం టిడిపి కోవర్ట్ అని మాజీ ఎమ్మెల్యే సునీల్కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సత్యవేడు నియోజకవర్గంలో సాధారణ ఎంపీపీగా ఉన్న వ్యక్తిని గుర్తించి ఎమ్మెల్యేని చేసిన ఘనత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి దక్కుతుందని అయితే మంత్రిని ఆయన విమర్శించడం తగదన్నారు. రాయలసీమలోనే వైసీపీకి పెద్దదిక్కుని 40సంవత్సరాల పాటు రాజకీయాలలో ఎదిగిన వ్యక్తిని రాష్ట్రంలోనే పలు వ్యాపారాలు చేపట్టి గుర్తింపు పొందిన వ్యక్తిని వైసీపీలో ప్రధానమైన నాయకుడుగా ఉన్న వ్యక్తిని విమర్శించడం తగదని ఆయనకు క్షమాపణ చెప్పి మాట్లాడిన మాటలను వాపసు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్, ఎంపీపీ అమరావతి, మండల కన్వీనర్ రామచంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు దత్రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, అమర్నాథ్, మొఘలేశ్వర, ఎల్లప్ప పాల్గొన్నారు.

మోహితను అభినందించిన ఎంపిపి దంపతులు


మోహితను అభినందిస్తున్న ఎంపీపీ దంపతులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీలలో బాలికల జట్టులో బ్యాడ్మింటన్ పోటీలలో రన్నర్గా గెలుపొందిన పోటుగారి మోహితను మంగళవారం ఎంపిపి దంపతులు బండి నాగరాణి హేమ సుందరెడ్డిలు అభినందనలు తెలిపారు. బ్రాహ్మణపల్లి సచివాలయ పరిధిలోని బలిజ మొండిపల్లి గ్రామంలోని జిల్లా కాంగ్రెస్పార్టీ అధ్య క్షుడు పోటు గారి భాస్కర్, సర్పంచ్ పోటుగారి లలితల కుమార్తె పోటుగారి మోహిత బ్యాడ్మింటన్ పోటీలలో పంచాయతీ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రన్నర్గా నిలవడం ఎంతో గర్వించాల్సిన విష యమని చెప్పారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

సైన్స్ ఒలంపియాడ్లో విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-పెద్దపంజాణి: సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఆన్లైన్ పరీక్షల్లో మదర్ థెరిసా విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపినట్లు ఆ విద్యా సంస్థల అధినేత రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు మదర్ థెరీసా ఔత్సాహిక విద్యార్థులు 26మంది ఈ పోటీ పరీక్షల్లో పాల్గొన్నారని, ఈ పరీక్షలలో ఏడవ తరగతి విద్యార్థిని వైష్ణవి, ఆరవ తరగతి విద్యార్థి శరత్ బాబు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి శాస్త్రీయ ప్రతిభను కలిగి తమ జ్ఞానంతో విమర్శనాత్మక ఆలోచనలు చేసి సమస్య పరిష్కార నైపుణ్యాలను అలవర్చుకొని భవిష్యత్తులో రాణించాలని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ శ్రేయ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డేవిడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు


సీసీ రోడ్డు పనులు

ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పంలో సీసి రోడ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా పలు వీదులు గుంతల మయమై ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల అవసరాల దృష్ట్యా స్పందించిన సర్పంచ్ బి.వి.మురళి సిమెంట్ రోడ్లు ఏర్పాటుకు పూనుకున్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ సహకారంతో రూ.కోటికు పైగా జిజిఎం, ఎంపి నిధులు, ఎన్ఆర్జిస్ నిధులతో ఈ రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఇప్పటికే ఇందిరానగర్, పాత మసీదు వీధి, కుమ్మర వీధి, పోస్ట్ ఆఫీస్ వీధి, రాంనగర్ తదితర వీధుల్లో సిసి రోడ్లు శరవేగంగా ఏర్పాటవుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే పంచాయతీ పరిధిలోనీ గ్రామాల్లో పూర్తి స్థాయిలో సిసి రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ మురళి చెప్పారు.

చెరువు కబ్జాకు యత్నం



- అధికారులు పట్టించుకోలేదని రైతుల గగ్గోలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని గుంతూరు రెవిన్యూలో వరదప్పనాయిని చెరువు కబ్జాకు గురైనట్లు పలువురు రైతులు తెలిపారు. గుంతూరు పంచాయతీకి సమీపంలోని చెరువును సమీప పొలాలు వారు కబ్జా చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం లేదని మండిపడ్డారు. గతంలో చెరువుకు తీసిన కాలువలను మూయించేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం కారణంగా యథేచ్ఛగా కబ్జా జరుగుతోందని ఆరోపించారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం



ప్రజాశక్తి-పెద్దపంజాణి: పలమనేరు నియోజకవర్గ స్థాయిలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలమనేరు ఎంపీడీవో విద్యాసాగర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించడానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయన్నారు. క్రీడాకారులందరూ ఈ పోటీల్లో క్రీడా స్ఫూర్తితో మసలుకోవాలని సూచించారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను కూడా అందజేశారు. కార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ ఛైర్మన్ చాముండేశ్వరి సుధా, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రహల్లాద, పలమనేరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, కోగిలేరు, అమ్మరాజుపల్లి సర్పంచులు రమేష్ బాబు, స్వర్ణమ్మ, ఉపాధ్యాయులు సురేష్బాబు, శశిప్రకాష్, నూరుద్దీన్, అజీమ్, తులసీరామ్, అన్నదొరై పాల్గొన్నారు.


ప్రతి పనీ ప్రజాహితం కొరకే : సెల్వమణి

ప్రజాశక్తి-నగరి: నియోజకవర్గంలో చేపట్టే ప్రతి పనీ ప్రజాహితంగానే మంత్రి ఆర్కేరోజా చేపడుతున్నారని ఆమె భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి అన్నారు. మంగళవారం కుశస్థలీ నదిపై ఉన్న లోతట్టు వంతెన వరదనీటికి చిద్రం కావడంతో తాత్కాలికంగా మట్టిరోడ్డును ఏర్పాటు చేసిన ప్రాంతంలో పక్కాగా తారురోడ్డు నిర్మించే పనులను, మున్సిపల్ బస్టాండును నవీకరించే పనులను, సంతమైదానంలో నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి ఆర్కేరోజా ప్రతి పనిని పక్కాగా, ప్రణాళికాత్మకంగా చేస్తున్నారన్నారు. ప్రజాహితంగానే ప్రతి పనీ కొనసాగుతోందన్నారు. కీళపట్టు మార్గంలో ఇదివరలో యుద్ధప్రాతిపదికన తాత్కాలిక రోడ్డును ఏర్పాటుచేయడం జరిగిందని నేడు పక్కాగా తారు రోడ్డు వేస్తున్నామన్నారు. అలాగే నగరి ప్రజల ఎన్నో రోజుల కల అయిన మున్సిపల్ కాంప్లెక్స్ను దృఢంగా నిర్మిస్తున్నామన్నారు. మున్సిపల్ బస్టాండుకు మరమ్మత్తులు చేసి రంగులు వేసి నవీకరించనున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బీడీ భాస్కర్, గోపాల్రెడ్డి, ఇంద్రయ్య, యాకోబు, మురుగ, బిలాల్, అమర్, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, హమీద్ తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఆర్కే సెల్వమణి

టీడీపీతోనే మహిళా సంక్షేమం..


- టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి మురళీమోహన్


ఇంటింటి ప్రచారంలో డాక్టర్ మురళీమోహన్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మహిళలకు టీడీపీలోనే గౌరవప్రదమైన సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్టు పూతలపట్టు నియోజకవర్గ అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఊటువంక, గోవర్ధనగిరి గ్రామాల్లో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ టీడీపీ మినీ మ్యానిఫెస్టొని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సింగల్విండో అధ్యక్షులు హేమచంద్రనాయుడు, నాయకులు భాష్యం వంశీచౌదరి, హరి, బాషా, నజీర్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికే 'ఆసరా'

- మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్


ఆసరా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్


ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా నిధులు అందజేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సునీల్కుమార్ అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు 4వ విడత ఆసరా పంపిణీ కార్యక్రమం ఎంపీడీవో హరిప్రసాద్రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 1502సంఘాలకు 14564 సభ్యులకు రూ.17కోట్ల15లక్షలను విడుదల చేసినట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీలు శిరీష్ రెడ్డి, జయకుమార్, జడ్పిటిసి సోమశేఖర్, సింగల్ విండో అధ్యక్షులు దత్తురెడ్డి కురబ, నాయకులు అమర్నాథ్, ఈశ్వర, ఎల్లప్ప సర్పంచులు శ్రీనివాసులు, ఉమాదేవి, శ్రీహరి, వాణిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రజాశక్తి-రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలోని శేషాపురం, చిన్న రామాపురం గ్రామాలలోని పంట పొలాలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. శేషాచలం అడవుల్లోని భాకరాపేట అటవీ ప్రాంతం నుండి ఏనుగుల గుంపు 20 రోజుల క్రితం వచ్చాయి. సోమవారం శేషాపురంకు చెందిన సంపూర్ణమ్మ, నాగేశ్వరరావు పొలాలలోని పంటలను ధ్వంసం చేశాయి. చెన్నకేశవులకు చెందిన 14మామిడి చెట్లు, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. చిన్న రామాపురం గ్రామంలో షాజహాన్కు చెందిన రెండు ఎకరాలలో కొబ్బరి, మామిడి, అరటి చెట్లను ధ్వంసం చేయడమే కాకుండా పొలానికి వేసిన ఇనుప కంచను కూడా ధ్వంసం చేశాయి. సోమవారం రాత్రి సుమారు 13ఏనుగులు పొలాల్లోకి ప్రవేశించి భీకరంగా అరుపులు అరుస్తూ డ్రిప్ ఇరిగేషన్ పైపులను, జొన్న గడ్డిని ధ్వంసం చేశాయి. ఏనుగుల భీకరమైన అరుపులకు రైతులు భయపడిపోయామని వాపోయారు. రైతులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అటవీశాఖ అధికారులు మంగళవారం పొలాల వద్ద రాత్రి వేళల్లో బాణాసంచాలు పేలుస్తూ, డప్పులు వాయిస్తూ ఏనుగులను బెదిరించి కళ్యాణిడ్యాం అటవీ ప్రాంతం వైపు మళ్లీ ఇస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. దీంతో గ్రామంలోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించండి

- దళితులకు బ్యాంకు రుణాలు ఇప్పించండి
- ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యుల ధ్వజం



మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మాటూరి మురళి

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలాన్ని గత పది సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాల్లో అడుగుతున్నా ఎలాంటి స్పందన లేదని, దళితులకు, దళిత యువకులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడంలేదని మంగళవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక భవన సమావేశ మందిరంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తహశీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ అమాస మోహన్, వైస్ ఎంపీపీ ప్రభాకర్ ఇతర అధికారులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు మాటూరి మురళి మాట్లాడుతూ అంబేద్కర్ భవన నిర్మాణాన్ని చేపట్టాలని గత పది సంవత్సరాలుగా సమావేశాల్లో అడుగుతున్నా స్పందన కరువైందని భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని అటు తర్వాత కలెక్టర్ మంత్రి పెద్దిరెడ్డి అనుమతితో భవన నిర్మాణానికి నిధులు కేటాయించుకుంటామని తాము ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పెడచెవిన పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడారు. అదేవిధంగా మండలంలో ఐదు జాతీయ బ్యాంకులు ఉండగా ఏ బ్యాంకు ఇంతవరకు 'పీఎంఈజెవై' చిన్న పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు ఇవ్వడానికి మొఖం చాటేస్తున్నారని కనీసం మండలంలోని ఏ బ్యాంకు వారు కూడా దళితుల కోసం బ్యాంకు పథకాలు ఉన్నాయని ఏ రోజు బహిరంగంగా గ్రామాల్లో చెప్పింది కూడా లేదని అగ్రవర్ణాల వారికి డబ్బు ఉన్న వాళ్లకే రుణాలు ఇస్తూ దళితుల పట్ల వివక్ష చూపిస్తున్నారని ఇది సమంజసం కాదని దళితులు ఆర్థికంగా ఎదగాలంటే బ్యాంకులు రుణాలు మంజూరు చేసి తద్వారా దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశానికి విలేకరులను ఎందుకు ఆహ్వానించలేదని ఇక్కడ జరిగే సమాచారం పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేసేది విలేకరులేనని వారిని ఆహ్వానించకపోవడం పద్ధతి కాదని అన్నారు. ఆరు నెలల క్రితం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆ తర్వాత నిర్వహించకపోవడంపై కమిటీ సభ్యులు ఒత్తిడితో అధికారులు మంగళవారం సమావేశం నిర్వహించినట్లు సమాచారం. పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాలేదు దీనిపై కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దళితుల అభివృద్ధి దళితుల సమస్యలపై అన్ని శాఖల సమన్వయంతోనే సాధ్యమవుతుందని అలాంటిది మానిటరింగ్ కమిటీ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మొగిలీశ్వర, ప్రకాష్, శివమణి, వెంకటరామయ్య, ప్రభు, మణికంఠ, లోకేష్, రవి, లక్ష్మీపతి, ఎంఈఓ శివరత్నమ్మ, ఈవోఆర్డి లక్ష్మీదేవి, ఏపీవో దినకర్, పంచాయతీ కార్యదర్శులు విఆర్వోలు హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొన్న బస్సు

- 15 మందికి గాయాలు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొని 15మందికి గాయాలైన సంఘటన మండలంలోని తంబుగానివల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. తిరుపతి నుండి బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు తంబుగానిపల్లి వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మందికి గాయాలు కాగా ఏడు మందిని బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి 8 మందిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.